
# డి. వెంకట్రామయ్య

# చెడిపోయిన మనిషి



నేను పదేళ్ళకిందట ఒక తప్పుచేశాను. అందుకు ఫలితం ఇప్పుడనుభవిస్తున్నాను.

* * *

పదేళ్ళకిందట బెజవాడ బస్‌డిపోలో హైదరాబాద్ బస్సు ఎక్కబోతుండగా స్వరాజ్యం కనిపించింది. అపట్పికి నాకింకా పెళ్ళవలేదు. హైదరాబాదొచ్చి వుద్యోగంలో చేరికూడా అప్పటికి ఐదారు మాసాలకంటే ఎక్కువకాలేదు. పెళ్ళిసంబంధమొచ్చింది; పిల్లని చూద్దువుగాని రమ్మని ఇంటిదగ్గర్నించి ఉత్తరమొస్తే శెలవుపెట్టి వెళ్ళి చూసొస్తున్నాను.

ఆ పిల్ల రెండుకళ్ళతోనూ రెండు వేపులకి చూస్తోంది. పెళ్ళిచూపులకి కూర్చున్న చాలా సేపటిదాకా ఆ అమ్మాయి నావంక చూస్తోందో నా పక్కనే కూర్చున్న మా బాబాయివంక చూస్తోందో నా కర్థంకాలేదు. అది తెలీకనే— "ఇదేమి టీ అమ్మాయి నేను ప్రశ్నలడిగితే మా బాబాయికి సమాధానంచెప్తుంది; నన్నొదిలేసి ఆయన్ని చూసి సిగ్గుపడుతుంది"— అనుకుని చాలా సేపు నాలో నేను మథనపడ్డాను. అది ఆ అమ్మాయి మెల్లకళ్ళ ప్రభావమని గ్రహించిన తర్వాత నాకింకో అనుమానం పట్టుకుంది.

మేమెవ్వరమూ అడక్కుండానే ఆ అమ్మాయిచేత పాటపాడించారు. పాట ఏదో మోస్తరుగా వుందిగాని, పాడేప్పుడు బాగా గమనించాను—ఆ అమ్మాయి నోట్లో పళ్ళన్నీకూడా కింద రెండు వరసలూ పైన రెండు వరసలూ వున్నట్టుగా అనిపించింది. దాంతో హడిలిపోయి లేచివచ్చాను.

ఇంటికి తిరిగొచ్చాక—మెల్లకన్నుంటే అదృష్టమంది—మా అమ్మ. పళ్ళు ఒక వరస ఎక్కువుంటే మాత్రం ఏంపోయింది. అంతగా అనవసరమనుకుంటే ఒకవరస పీకించెయ్యొచ్చు—అన్నాడు మా నాన్న. ఆ పిల్ల వొంటి నిండా దిగేసిన నగలు మా అమ్మకీ, పిల్లతండ్రి ఇస్తానన్న రూపాయలకట్టలు మా నాన్నకీ బాగా నచ్చాయి. అందుకని వాళ్ళకాసంబంధం బాగా నచ్చింది.

నేను పెళ్ళయినా మానుకుంటాను గాని ఆ అమ్మాయినిమాత్రం ఛస్తే చేసుకోనని అందరితోనూ మాట్లాడి, ఇంకా శెలవు నాల్రోజులుండగానే బయల్దేరి, వచ్చేశాను.

అందుకని మనసంతా మహా చిరాగ్గా వుంది. ఏప్రిల్ ఎండల్లో, ఆ వేడిలో, దుమ్ములో, రద్దీలో రభసలో గందరగోళంలో బెజవాడ బస్‌డిపోలో మరీ చిరాగ్గావుంది. ఎప్పుడు వెళ్ళి హైదరాబాద్‌లో పడదామా అని కూర్చున్నాను. అలాంటి తరుణంలో స్వరాజ్యం కనిపించింది.

* * *

స్వరాజ్యాన్ని నేను ప్రేమించాను. మా ఇద్దరిదీ ఒకవూరే. ఒకే హైస్కూల్లోనూ ఒకే కాలేజీలోనూ ఒకే క్లాసులోనూ చదువుకున్నాం. బియ్యే సెకండియర్లో కొచ్చేసరికి చాలా నవలలు చదివీ ఇంకా చాలా సినిమాలు చూసి నా జ్ఞానాన్ని బాగా అభివృద్ధి చేసుకున్నాను. ఆ అనుభవంతోనే నేను స్వరాజ్యాన్ని ప్రేమిస్తున్నాను, అని గ్రహించిన వాడనై— ఒకనాడు కాలేజీనుంచి ఇంటికి వెళ్తుండగా, దార్లో స్వరాజ్యాన్ని ఆపి, "నేను నిన్ను ప్రేమిస్తున్నాను"— అన్నాను.

స్వరాజ్యం ఏమీ అనలేదు. నావంక అదోలా చూసి, నవ్వి, చకచకా నడుచుకుంటూ వెళ్ళిపోయింది.

ఆ తర్వాత వరసనే మూణ్ణెల్లపాటు— మామూలు రోజుల్లో అయితే రోజుకి రెండుచొప్పునా, శెలవురోజుల్లో అయితే నాలుగుచొప్పునా ప్రేమలేఖలు రాసి— స్వయంగా స్వరాజ్యానికి అందించాను. ఏమీ అనకుండా మారుమాట్లాడకుండా అవన్నీ తీసుకునేది. నా ప్రేమ ఫలిస్తోందన్న నమ్మకం కుదిరి, ఆ ధైర్యంతోనే, ఒకనాడు స్వరాజ్యం ఎందుకో మాయింటికొస్తే, ఎవరూ లేకుండాచూసి గభాల్న కావలించుకుని ముద్దెట్టుకోబోయాను.

నన్నొక్క–తోపుతోసి కళ్ళెర్రజేసింది స్వరాజ్యం. ఆ కోపమూ ఆ రూపమూ చూసి నేను జడుసుకున్నాను. కొడ్తుందేమో అనుకున్నాను గాని కొట్టలేదు. "మరోసారి ఇలాంటి వెధవవేషాలేస్తే పళ్ళు రాలగొడతాను"— అని వాగ్దానం మటుకుచేసి వెళ్ళిపోయింది.

అంతే, స్వరాజ్యం మళ్ళీ నా మొహం చూళ్ళేదు.

ఆ తర్వాత కొద్దిరోజులకే స్వరాజ్యం తండ్రికి గుంటూరు ట్రాన్స్‌ఫరొచ్చి అంతా అక్కడికి వెళ్ళిపోయారు. స్వరాజ్యంకూడా టీసీ తీసుకువెళ్ళి, గుంటూరు కాలేజీలో చేరింది.

స్వరాజ్యం వెళ్ళిపోయాక నేనింకా కొన్ని నవలలు చదివీ, మరికొన్ని సినిమాలు చూసీ భగ్నప్రేమికుడెలా వుండాలో గ్రహించి, కనీసం మూణ్ణెల్లపాటు ఆ విధంగా విచారసాగరంలో మునిగితేలాను. ఆ తర్వాత కాస్త సర్దుకున్నాను. స్వరాజ్యాన్ని మటుకు మర్చిపోలేదు.

* * *

ఆ తర్వాత మళ్ళీ బెజవాడ బస్ డిపోలోనే స్వరాజ్యం కనిపించటం. బస్సుకింకా టైముందిగదా అని సామాను బస్సులో పెట్టేసి కిందకి దిగి సిగరెట్టు కాలుస్తూ అటూ యిటూ పచార్లు చేస్తున్నాను. బుక్‌స్టాల్ దగ్గర నిలబడి ఏదో పత్రిక తిరగేస్తూ స్వరాజ్యం కనిపించింది.

నా ప్రాణం లేచివచ్చింది. అసలే చిరాగ్గా వున్నానేమో, ఆ మెల్లకళ్ళ అమ్మాయి రూపమింకా మనసుతెర మీంచి తొలగలేదేమో, అలాంటప్పుడు స్వరాజ్యాన్ని చూడ్డం—బ్లాక్ అండ్ వైట్‌లో ఏడుపొచ్చే సినిమా చూశాక, కలర్‌లో మంచి ప్రేమకథ చూసినట్టుగా కమనీయంగా వుంది.

నాకంటే స్వరాజ్యమే నన్ను ముందు చూసినట్టుంది. నావంకే చూసి నవ్వుతోంది. చెయ్యివూపి, రమ్మని పిలిచింది. దగ్గరకెళ్ళి ఎదురుగా నిలబడ్డాను.

నాకంతా కలగావుంది. ఏం మాట్లాడాలో తెలీటంలేదు. అన్నట్టు చెప్పటం మర్చిపోయాను. స్వరాజ్యం మంచి అందగత్తె. ఇప్పుడు మరీ అందంగావుంది. వెనకటికంటే ఇంకా వొళ్ళు చేసింది. అలా చూస్తూ నిలబడ్డాను.

స్వరాజ్యమే మాట్లాడుతోంది. ఎక్కడుంటున్నావంది. ఏంజేస్తున్నావంది. చెప్పాను. పెళ్ళిచేసుకున్నావా అంది. లేదని అడ్డంగా తలవూపాను. అప్పటికి కాస్త తేరుకున్నాను. "నువ్వు లేకపోయాక ఇంకా పెళ్ళెలా చేసుకుంటాను. ఎవర్ని చేసుకుంటాను !——" అన్నాను సాధ్యమైనంత గంభీరంగా.

స్వరాజ్యం పకపక నవ్వింది. నేనన్న మాటలో అంత నవ్వొచ్చే విషయమేముందో నా కర్థంకాలేదు. నవ్వి, "ఇంకా నీ పిచ్చి వదల్లేదన్నమాట"— అంది. నేను మరింత గంభీరంగా మరోసారి నా ప్రేమ ప్రకటించబోతుండగా అతి తెల్లటి బట్టలు వేసుకుని అతి నల్లగా వున్నవాడొకడు ఒకచేత్తో ఫ్లాస్కూ– మరో చేత్తో అరటిపళ్ళూ పట్టుకొచ్చి, మా యిద్దరికీ మధ్య నిలబడ్డాడు.

అందుకు నేను నా నిరసన తెలియజెయ్యబోతూవుండగా– "మా ఆయన" అని, వాణ్ణి నాకు పరిచయంచేసింది స్వరాజ్యం.

నా గుండె ఆగిపోయింది. నా కళ్ళు బైర్లుగమ్మాయి.

నన్నుకూడా వాళ్ళాయనకి పరిచయంచేసింది స్వరాజ్యం. చేసి, ఏవీ మల్లెపూలేవీ అని భర్త నడిగింది. ఇదుగో ఇప్పుడే తెస్తానంటూ ఫ్లాస్కూ అరటిపళ్ళూ స్వరాజ్యానికిచ్చి, మళ్ళీ ఎటో పోయాడు ఆ నల్లటివాడు.

నాకు ఏడుపొచ్చింది – స్వరాజ్యానికి పెళ్ళయిపోయినందుకూ ; పెళ్ళయినా నాతో కానందుకూ ; నాతో కాకపోయినా ఆ నల్లటివాడితో అయినందుకూ.

స్వరాజ్యమే చెప్పింది—ఆ నల్లటి వాడు గుంటూరు కాలేజీలో పరిచయమయ్యాట్ట. వాణ్ణి ప్రేమించి పెళ్ళిచేసుకుందట. వాడికిప్పుడు మద్రాసులో వుద్యోగమట. నాకుమరీ ఏడుపొచ్చింది.

కాస్సేపటికి ఎలాగైతేనేం నన్ను నేను నిగ్రహించుకున్నాను. ప్రేమ గురించి నవలలు చదివీ సినిమాలు చూసి గడించిన అపారమైన విజ్ఞానం అప్పటికింకా నాలో మిగిలివుంది. దాన్నే ఆధారంగా చేసుకుని చివరి సారిగా స్వరాజ్యంతో ఒకమాటన్నాను.

"రాజ్యం నిన్ను నేను ప్రేమించాను; జీవితాంతం ప్రేమిస్తూనేవుంటాను; నువ్వు నాకు దక్కలేదు; అది నా దౌర్భాగ్యం; అయినా జీవితంలో ఏనాటికైనా నువ్వు నా ప్రేమ గుర్తిస్తేచాలు; నా హృదయ కవాటాలు నీకోసం ఎప్పుడూ తెరుచుకునే వుంటాయి. నీకు స్వాగతం పలకటానికి నీకోసం నా ప్రాణమైనా సరే ఇవ్వటానికి నేను సర్వదా సిద్ధంగానే వుంటాను. మర్చిపోకు, వస్తా"— అని, మరుక్షణంలో అక్కణ్ణుంచి వచ్చేసి, బస్సెక్కి కూర్చున్నాను.

నా వెనకాల స్వరాజ్యం నవ్వినట్టుగా అనిపించింది.



* * *

ఇదంతా జరిగి పదేళ్ళయింది. ఆనాడు ఏదో వెర్రిలో తెలిసీ తెలియక అన్న మాటలు పట్టుకుని, ఇప్పుడు స్వరాజ్యం వచ్చి నా పీకలమీద కూర్చుంది.

ఈ మధ్యకాలంలో నాకూ పెళ్ళయింది. పిల్లలు పుట్టారు. ఇంక్రిమెంట్లొచ్చాయి, ప్రమోషన్లొచ్చాయి. నాకూ కాస్త బుద్ధొచ్చింది. ప్రపంచజ్ఞానం వచ్చింది. భ్రమలు వదిలాయి. బతకడం తెలిసింది. నే నిప్పుడు పెద్ద వుద్యోగంలోనే వున్నాను. నా పలుకుబడీ గౌరవ ప్రతిష్ఠలూ పెరిగాయి. నే నిప్పుడు పెద్దమనిషిని.

ఈ పదేళ్ళలో స్వరాజ్యం మళ్ళీ నా కెన్నడూ కనబడలేదు, ఎప్పుడో ఏ కలలోనో తప్ప. నేను దాదాపు మర్చిపోయాను. అయితే నేను పూర్తిగా మర్చిపోకుండా, అడపా దడపా స్వరాజ్యాన్ని గురించిన వార్తలు కొన్ని నాకు తెలుస్తూ వచ్చాయి.

స్వరాజ్యం మద్రాసులో సినిమాల్లో చేరి చిల్లరవేషాలేస్తోందనీ పూర్తిగా చెడిపోయిందనీ ఆమెనీ నన్నూ కూడా ఎరిగున్నవాళ్ళు కొందరు అతి నమ్మకంగా నాకు చెప్పారు.

ఆ మధ్య నే నెప్పుడో చూసిన సినిమాలో—ఒక పిక్నిక్ దృశ్యంలో—సగం బట్టల్లేని హీరోయిన్ పక్కన, మూడొంతులు బట్టల్లేకుండా గంతులేసిన అమ్మాయి, స్వరాజ్యంలాగే వుందని నాక్కూడా అనిపించింది.

ఇలాంటి వార్తలన్నీ విన్నాక నాకు స్వరాజ్యంమీద కొంత విరక్తికూడా కలిగింది. ఆనాడు స్వరాజ్యం నా ప్రేమని నిరాకరించడం నా మంచికే జరిగిందనిపించింది. అలాంటిదాన్ని గురించి ఆలోచించటంకూడా అనవసరమనిపించింది.

ఇలాంటి సందర్భంలో ఇన్నాళ్ళకి స్వరాజ్యం నాదగ్గరకొచ్చి, నా పెద్దమనిషితనానికీ, నా గౌరవప్రతిష్ఠలకీ ప్రమాదం తెచ్చిపెట్టింది.

* * *

ఒకనాడు నేను ఆఫీసుపనిలో మునిగి తేలుతుండగా, ప్యూన్ నా గదిలోకొచ్చి "మీకోసం ఎవరో వచ్చారుసార్"— అన్నాడు. తీసుకురమ్మన్నాను.

మరుక్షణంలో స్వరాజ్యం వచ్చి నా కెదురుగా కూర్చొంది.

నా కళ్ళని నేను నమ్మలేకపోయాను. వెనకటికంటే ఇంకాస్త లావైంది. మనిషి మరింత నిండుగావుంది. నేనేమీ మాట్లాడకముందే "నీకోసమే వచ్చాను. నువ్వు నాకు సాయంచెయ్యాలి"— అంది.

ఏదో ప్రమాదం వచ్చిపడిందను

కున్నాను. స్వరాజ్యాన్ని ఇంటికి తీసుకెళ్ళడానికి నాకెందుకో మనస్కరించలేదు. పని త్వరగా ముగించుకుని, ఆఫీసుకి దగ్గర్లోవున్న హోటల్లోకి తీసుకెళ్ళి కూర్చోబెట్టి కాఫీ, టిఫినూ తెప్పించాను. ఆమె విషయంలో నాకిప్పుడేమీ ఆశలూ ఆసక్తులూ లేవు. కుతూహలం మాత్రముంది. ఏమిటి నీ కథ చెప్పమన్నాను. స్వరాజ్యం చెప్పింది.

ఆ నల్లటివాడు—స్వరాజ్యం భర్త—మద్రాసులో కొన్నాళ్ళు ఉద్యోగం వెలగబెట్టి,ఆ తర్వాత మానేశాడు. సినిమాల్లో ప్రొడ్యూసర్‌గా వెలుగుదామని, ఒక స్నేహితుడి మాయమాటలు నమ్మి, తన కున్నదంతా అమ్మి తెచ్చి, నాల్రోజులు వెలిగి, ప్రొడ్యూసర్ కాకముందే పూర్తిగా ఆరిపోయాడు. వెలిగేరోజుల్లో అన్ని లక్షణాలూ అన్ని అలవాట్లూ అలవర్చుకున్నాడు. తను ప్రొడ్యూసర్ కాకపోయినా తన భార్యనైనా తారగా వెలిగిద్దామని స్వరాజ్యాన్ని బలవంతాన సినిమాల్లో చేర్పించాడు. తారగా వెలగటానికి చెయ్యాల్సిన పనులన్నీ స్వరాజ్యం చేత చేయించాడు. ఎన్నిపనులు చేసినా ఎక్స్ట్రా వేషాలకి మించి స్వరాజ్యానికి మరేమీ దొరకలేదు. చివరికి తిండికి దొరకటంకూడా కష్టమైతే స్వరాజ్యం మద్రాసునుంచి మకాంమార్చి హైదరాబాద్ చేరింది.

స్వరాజ్యం చెడిపోయిందని నేనువిన్న వార్తలు నిజమో కాదో తెలుసుకోడానిగ్గాను—నా తెలివంతా ఉపయోగించి డొంకతిరుగుడుగా కొన్ని ప్రశ్నలడిగాను.


స్వరాజ్యం నా ప్రశ్నలకి సూటిగానే సమాధానం చెప్పింది. "నువ్వు విన్నది చాలామటుకు నిజమే. నేను చెయ్యకూడనిపనులు చాలా చేశాను. కాని అవన్నీ నాకు వొళ్ళు కొవ్వెక్కి చేసిన పనులుకావు. ఆయనకోసం, ఆయన సంతోషంకోసం చేశాను..." అంది.

"మరిప్పుడు మీ ఆయనేడీ... ఆయనేం చేస్తున్నాడు?"—అని అడిగాను.

"ఆయనకి ఏడాదిక్రితం పక్షవాతం వచ్చింది. మంచానపడ్డారు. ఆయన్ని కూడా నేనే పోషించాలి. అందుకోసం నేను ఇతరత్రా చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు.అందుకే నీకోసమొచ్చాను... నాకు నీ ఆఫీసులో ఏదన్నా ఉద్యోగమివ్వు...నేనూ బియ్యే పాసయ్యాను" అంది.

ఎలాంటి స్వరాజ్యం బ్రతుకు ఎలా అయిపోయిందా అనిపించింది. నాకెందుకో స్వరాజ్యం భర్తంటే ఎక్కడలేని అసహ్యమూ, కోపమూ కలిగాయి.

"అతనితో ఇంకా నీకెందుకు? నిన్నింతచేసి, అన్నివిధాలా నాశనంచేసి చివరికి ఎందుకూ పనికిరాకుండా నీకే బరువైకూర్చున్నాడు. అతని మానాన అతన్ని వదిలేసి హాయిగా నీ బ్రతుకు నువ్వు చూసుకోగూడదూ?" అన్నాను. స్వరాజ్యం ఇప్పుడు నా సాయంకోరి నా దగ్గరకొచ్చి, నాకు చులకనై పోయింది. అందుకే ఒకప్పుడు ఆమెతో ఒక్కమాట మాట్లాడ్డానికికూడా భయపడేవాణ్ణి, ఇప్పుడామెకి అలాంటి సలహాయిచ్చాను.



స్వరాజ్యం నవ్వింది. ఆ నవ్వు నా మొహాన వూసినట్టుగా వుంది. "ఆయన్ని నేను ప్రేమించాను... ఆయన ఎంత చెడినా నన్నెంత చెరిపినా, ఇప్పుడు నాకెంతబరువైనా ఆయన్ని నేను వదలను...ఆయనకోసం ఇక ముందుకూడా ఎలాంటిపనయినాసరే చెయ్యటానికి వెనకాడను..." అంది.

స్వరాజ్యానికి మా ఆఫీసులో వుద్యోగమిచ్చాను. పక్షవాతంతో వున్న భర్తని తీసుకొచ్చి హైదరాబాద్‌లో కాపరంపెట్టింది స్వరాజ్యం.

ఈ మధ్యలో నాగురించీ స్వరాజ్యం గురించీ ఆఫీసులో రకరకాలుగా చెప్పుకుంటున్నారు. అయినా నేను లెక్కచెయ్యలేదు. స్వరాజ్యం మామూలు మనిషికాదు.